క్లుప్తంగా

నాటు కోడి పిల్లల పంపిణీ

సత్తుపల్లి(కల్లూరు): ఉషోదయ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళాశక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘం సభ్యులకు కుటుంబ పోషణ ఆధాయ అభివృద్ధి కోసం 500 నాటుకోడి పిల్లలను ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఎం వెంకట్రామారావులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు వెంకటేశ్వరరావు, వెంకట్రావమ్మ, రాజ్యలక్ష్మి, అకౌంటెంట్ అపర్ణ లక్ష్మి, గ్రామ దీపికలు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ప్రక్రియ పరిశీలన

కారేపల్లి: సింగరేణి మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను డీఎల్‌పీఓ రాంబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే డేటా ఎంట్రీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, ఎన్యూమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన



మాట్లాడుతున్న విజయ భాస్కర్‌రెడ్డి

బోనకల్: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను జిల్లా లేబర్ ఆఫీసర్, మండల స్పెషల్ ఆఫీసర్ విజయ్ భాస్కర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఆర్‌ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

29న ప్రతిభా పాటవ పరీక్ష

కల్లూరురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షకు హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 29న ప్రతి హైస్కూల్ నుంచి ముగ్గురు ఇంగ్లీష్‌మీడియం, ముగ్గురు తెలుగు మీడియం విద్యార్థులు పరీక్షకు హాజరుకావాలని గణిత ప్రతిభ పాటవ పరీక్షల కన్వీనర్ కృష్ణారావు, పరీక్ష నిర్వహణ కార్యదర్శులు ఎండీ మౌలాలి, అమర్లపూడి చక్రవర్తిలు తెలిపారు. గణిత ఉపాధ్యాయుల సహకారంతో పరీక్షలు నిర్వహిస్తారని, కల్లూరు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 1:30 గంటలకు జరిగే పరీక్షలకు విద్యార్థులు తమ హెచ్‌ఎం నుంచి ధృవపత్రం తీసుకురావాలని కోరారు.

ఆబ్కారీ ఎస్సైకి ఎఫ్‌ఎస్‌ఓ ఉద్యోగం



నల్లాల రతన్ ప్రసాద్ రెడ్డి

వైరా: వైరా ఆబ్కారీ శాఖలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న నల్లాల రతన్ ప్రసాద్ రెడ్డి టీఎస్‌పీఎస్‌సీ విడుదల చేసి ఎఫ్‌ఎస్‌ఓ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని చార్మినార్ జోన్‌లో ఎఫ్‌ఎస్‌ఓ ఉద్యోగం సాధించాడు. తండ్రి రాజిరెడ్డి ప్రోత్సాహకంతో వెటర్నరీ సైన్స్ విద్యనభ్యసించిన ఆయన కొంతకాలం గజ్వేల్‌లో పశువైద్యునిగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత 2020లో గ్రూప్–2 ఉద్యోగం సాధించి వైరాలోని ఆబ్కారీ శాఖలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సైగా విధులు నిర్వరిస్తూ ఎఫ్‌ఎస్‌ఓ ఉద్యోగం సాధించారు. గ్రూప్–1 ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని రతన్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మిర్చి పంట సాగుపై అవగాహన

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలోని మిర్చి పంటలను బుధవారం మధిర ఏడీఏ ఎస్.విజయచంద్ర పరిశీలించారు. మిర్చి పంట సాగులో మెళకువలను రైతులకు వివరించారు.అధిక ఎరువుల వినియోగంతో పంటకు సోకే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎరువులను విడతల వారీగా వాడితే మంచి ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని ఆదరణ ఫౌండేషన్‌లో బుధవారం నిరుపేదలకు, దివ్యాంగులకు అన్నదానం చేశారు.

మధిర స్వీమర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి మనవడు, రాజ్ కుమార్ రెడ్డి, సౌమ్య దంపతుల కుమారుడు రుశాంక్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు, జంగా శ్రీనివాస్ రెడ్డి, చుక్కా రాంబాబు, భూక్యా హనుమ, గండూరి రాంబాబు, శీలం శ్రీనివాస్ రెడ్డి, షకూర్, సైదులు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డివైడర్లు

- రోడ్డు మరమ్మతులతో చిన్నవిగా మారిన డివైడర్లు
- రాత్రివేళలో కనిపించని వైనం..
- చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు కరువు



డివైడర్ ఎక్కి ప్రమదానికి గురైన ప్రైవేట్ అంబులెన్స్



తల్లాడ బస్టాండ్ సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న డివైడర్



కల్లూరు రోడ్డులో పగిలి పోయి అధ్వానంగా ఉన్న డివైడర్

తల్లాడ: నిత్యం రద్దీగా ఉండే తల్లాడ పట్టణంలో వరంగల్–దేవరపల్లి జాతీయ రహదారిలో డివైడర్లు, స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు సరిగా లేకపోవటంతో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. తల్లాడ, సత్తుపల్లి రోడ్డు, వైరా రోడ్డు, కొత్తగూడెం రోడ్డులో ప్రమాదాలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు కారణం డివైడర్లు రోడ్డులో కలిసి పోయే విధంగా మారడం, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, అలాగే సిగ్నల్స్(సూచిక హోర్డింగ్‌లు) బోర్డులు లేక పోవడంతో వాహన చోదకులకు అసౌకర్యంగా ఉంది.

బస్టాండ్ సెంటర్‌లో పలు ప్రమాదాలు..

తల్లాడలో డివైడర్లు 15 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో నిర్మించిన డివైడర్లు రోడ్డు మరమ్మతులు కారణంగా ఎత్తు తగ్గాయి. తల్లాడ టీఎస్ ఆర్‌టీసీ బస్టాండ్ సెంటర్‌లో పలు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇక్కడ వచ్చే పోయే వాహనాలకు డివైడర్లు కన్పించక పోవటం, స్పీడ్ బ్రేకర్లు లేకపోవటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక్కడ గత రెండేళ్లలో ఇద్దరు యువకుల ప్రాణాలు రోడ్డు ప్రమాద రూపంలో కబళించాయి. అంతే కాకుండా గత నెలలో బస్టాండ్ ఎదురుగా డివైడర్‌ను అంబులెన్స్ ఎక్కి దూసుకు పోవటంతో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ఇంకా పలు మార్లు ఇక్కడ ప్రమాదాలు జరిగాయి. స్పీడ్ బ్రేకర్లు కూడా ఇక్కడ లేక పోవడంతో వాహనాల వేగానికి అదుపు లేకుండా పోతుంది. డివైడర్లు ఎత్తు పెంచి ప్రమాదాలకు అడ్డు కట్ట వేయాల్సి ఉంది.

కనిపించని హోర్డింగ్‌లు, సిగ్నల్ బోర్డులు..

తల్లాడ పట్టణం పలు ముఖ్య పట్టణాలకు కూడలిగా ఉంది. సత్తుపల్లి, రాజమండ్రి, విజయవాడ, భద్రాచలం పుణ్యక్షేత్రం, కొత్తగూడెం పట్టణాలకు ఖమ్మం, హైదరాబద్ నుంచి వివిధ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే హైదరాబాద్, సూర్యాపేట, వరంగల్ ఖమ్మంకు పలు పట్టణాల నుంచి వాహనాలు తల్లాడ మీదుగా వెళ్తుంటాయి. అయితే దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు ఇక్కడ కనీసం సూచిక బోర్డులు కానీ, హోర్డింగ్‌లు కానీ లేకుండా పోయాయి. దీంతో వాహన చోదకులు తల్లాడ రింగ్ రోడ్డు వద్ద తిక మక పడుతున్నారు. మూడు రోడ్లు ఉండటంతో ఏ రోడ్డు ఎటు వెళ్తుందో కూడా కొందరికి అర్థం కాక రాంగ్ రూట్లో వెళ్లి తిరిగి మళ్లీ వెనక్కి వచ్చిన సంఘటనలు కోకొల్లలు. 15 ఏళ్ల క్రితం రోడ్డు విస్తరణ సమయంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు పాడై పోయాయి. మళ్లీ వాటిని పట్టించుకున్న దాఖలాల్లేవు.

డివైడర్ల ఎత్తు పెంచాలి..



తల్లాడలో ప్రస్తుతం ఉన్న పాత డివైడర్లు ప్రమాదాలకు దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో కొత్తగా ఎత్తు పెంచి డివైడర్లు నిర్మించాలి. డివైడర్లు ఎత్తు లేక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో పలువురు ప్రాణాలు కూడా ప్రమాద రూపంలో పోయాయి. డివైడర్లు నిర్మించి ప్రమాదాలను అరికట్టాలి.

– దూపాటి శ్రీనివాసరాజు, తల్లాడ

స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



తల్లాడ ప్రారంభం నుంచి కల్లూరు రోడ్డు, కొత్తగూడెం, వైరా రోడ్లలో డివైడర్లు నిర్మించి రోడ్డు మధ్యలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. వీటితో పాటు సిగ్నల్స్ బోర్డులు ఏర్పాటు చేసి, లైటింగ్ ఏర్పాటు చేయాలి. లైటింగ్ లేక పోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక పోవడంతో ప్రమదాలు సంబవిస్తున్నాయి.

– నాగపురి జనార్ధన్, తల్లాడ

ఇంటింటి సర్వేను పరిశీలించిన ఆర్డీఓ



సర్వే నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజేంద్రగౌడ్

కల్లూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే వివరాల నమోదును ఆర్డీఓ రాజేంద్రగౌడ్ బుధవారం పరిశీలించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చేపట్టిన నమోదు కార్యక్రమాన్నిఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు అందచేశారు. సర్వే నమోదులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు. కల్లూరు మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లోని సర్వే వివరాల నమోదుకు గాను 100 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించి ప్రక్రియను చేపట్టారు. సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సురేష్‌బాబు, కల్లూరు ఆర్ఐ ఉమామహేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఏటీఎం వద్ద ఘరానా మోసం

మధిర: మండలంలోని సాయిబాబా గుడి సమీపంలో ఉంటున్న దారా రంగారావు పెన్షన్ నగదును తీసుకునేందుకు ఎస్‌బీఐ ఎటీఎం కేంద్రంలోకి వెళ్లాడు. ఎటీఎం పెట్టి డబ్బులు తీసేందుకు ప్రయత్నించగా మనీ రాలేదు. దీంతో పక్కనే ఉన్న మరో వ్యక్తి నేను డ్రా చేసి ఇస్తానని చెప్పి పిన్‌నెంబర్‌ను తెలుసుకుని.. తప్పుగా కొట్టడంతో డబ్బులు రాలేదు. దీంతో రామారావు తన కార్డును తీసుకొని వెళ్లిపోయాడు. వెంటనే గుర్తుతెలియని వ్యక్తి తన కార్డుని పెట్టి రంగారావు పిన్‌నెంబర్ కొట్టి రూ.20వేల రూపాయలు తీసుకుని పరారయ్యాడు. అనుమానం వచ్చిన రంగారావు బ్యాంకుని సంప్రదించగా.. డబ్బులు తీశారని తెలుపడంతో ఆయన టౌన్ పోలీసులను ఆశ్రయించాడు.

పాల ఉత్పత్తుల పెంపుపై దృష్టి పెట్టాలి



సఖినవీడులో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కిశోర్

ఎర్రుపాలెం: పాడి పశువుల పెంపకందారులు పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచే దిశగా పోషకాహారం వినియోగంతో పాటు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని పశు గణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ కిశోర్ కోరారు. బుధవారం మండలంలోని సఖినవీడు గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ, ఇందిరా క్రాంతి పథకం సంయుక్తంగా పాడి పశువుల పెంపకందారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. పాల ఉత్పత్తుల పోటీలను నిర్వహించారు. అనంతరం గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. పశువులకు దూడలకు పశువైద్యాధికారి కృష్ణారెడ్డి చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మణరావు, పశువైద్య సిబ్బంది వెంకటేశ్వరరావు, లక్ష్మణాచారి, వెంకటేశ్వర్లు, సీసీ రమాదేవి, గోపాల మిత్రలు కృష్ణాంజనేయులు, రామ్ రహీం, వెంకటేశ్వర్లు, వీరయ్య, వరదారెడ్డి తదితరులున్నారు.

మూర్ఛ వ్యాధి బాధితుడిని ఆస్పత్రికి తరలింపు

మధిర: మూర్ఛ వ్యాధితో పాటు అకస్మాత్తుగా కుప్పకూలిన వ్యక్తిని మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాల్వంచ పట్టణానికి చెందిన మస్తాన్ అనే వ్యక్తి మధిరలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ చౌరస్తాలో ఒక్కసారిగా అతను ఫిట్స్‌తో పడిపోయాడు. స్థానికులు ఆర్కే ఫౌండేషన్ టీమ్‌కు సమాచారం అందించగా.. నిర్వాహకుడు దోర్నాల రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అతడిని 108 అంబులెన్స్‌లో ఖమ్మంకు తరలించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముదిగొండ: రైతులు ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి కోరారు. మండలంలోని బాణాపురంలో బుధవారం సహకార సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సన్నాలు విక్రయించి, ప్రభుత్వం ప్రకటించిన రూ.500ల బోనస్‌ను పొందాలని అన్నారు. కార్యక్రమంలో సీఈఓ వెంకటరత్నం, సిబ్బంది కందిమళ్ల లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీలు వట్టికూటి వెంకటేశ్వర్లు, పచ్చా సీతారామయ్య, వత్సవాయి సైదులు, పూర్ణచందర్‌రావు, హనుమంతరావు, రామారావు, రైతులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

ఏన్కూరు: కేజీబీవీ సర్వశిక్ష ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జిలతో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీ పాఠశాలల్లో నిరసన కార్యక్రమానిన నిర్వహిస్తున్నారని, జిల్లాస్థాయిలో రిలే నిరాహార దీక్షలను, జనవరి 28న చలో హైదరాబాద్ మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్‌చంద్, పుల్లయ్య, యూటీఎఫ్ మండల నాయకులు నాగేశ్వరావు, రాధాకృష్ణ, చంద్ర ప్రకాష్, సింగ్యా, శంకర్‌రావు, పుల్లయ్య, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్: కస్తూర్బాగాంధీ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు మినిమమ్ బేసిక్‌పే ఇవ్వాలని ఉపాధ్యాయులు పాఠశాల ముందు ప్లకార్డులతో బుధవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ. నాయకులు పద్మాబాబు, గోపాల్‌రావు, చిన్నరంగారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శివలింగానికి అన్నాభిషేకం

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడులోని ఆలయంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామికి కార్తీక మాసం సందర్భంగా బుధవారం శివలింగానికి అన్న మహాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు కాశావజుల నర్సింహమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ యన్నం పిచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున శ్రీస్వామిని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. అందరూ శివ లింగానికి అన్న మహాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం భక్తుల శివ నామస్మరణతో వైభవోపేతంగా జరిగింది.

సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మధిర(చింతకాని): రైతులకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి తెలిపారు. చింతకాని సొసైటీలో నేరడ గ్రామానికి చెందిన మంకెన సీతారాములుకు సభ్యత్వం ఉండడంతో ఆయనకు మంజూరైన రూ.50 వేల బీమా చెక్కు మంజూరైంది. దీంతో ఆ చెక్కును ఆయన భార్య పద్మకు శేఖర్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ మారగాని శ్రీనివాసరావు, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు రూ.10వేలు వితరణ

సత్తుపల్లి(సత్తుపల్లిరూరల్): కిష్టారం గ్రామానికి చెందిన పాలకుర్తి సుందర్‌రావు, చంద్రశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ క్షతగాత్రులకు కిష్టారం యువసేవా సమితి ఆధ్వర్యాన దాతల సహకారంతో రూ.10వేలు ఆర్థికా సాయం అందించారు. కార్యక్రమంలో టి.కేశవరెడ్డి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

సత్తుపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి విమర్శించారు. సత్తుపల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా రవాణా కోసం రైల్వేలైన్ ప్రారంభించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టాలని కోరారు. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, జ్యోతి, ఝాన్సీ, రమేష్, సనందన్‌రావు, భాస్కర్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన' సభను జయప్రదం చేయండి

మధిర(చింతకాని): ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవ రైతు సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్కా శేఖర్ గౌడ్ తెలిపారు. బుధవారం మండలంలోని బస్వాపురంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతుందన్నారు. అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయటం జరుగుతుందని, రైతుభరోసా కూడా రైతులకు అందజేయటం జరుగుతుందన్నారు. ఈ విజయోత్సవ సభకు జిల్లా నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు గోవిందరావు, నాయకులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఇబ్బంది పెట్టొద్దు..



తల్లాడ సీసీఐ కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ: ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్య కారణంగా గత మూడు రోజులుగా స్థానిక సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా.. బుధవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, సీసీఐ బయ్యర్లతో మాట్లాడిన తర్వాత.. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో ఫోన్‌లో ఆన్‌లైన్‌లో తలెత్తిన సమస్యను వివరించారు. దీంతో అప్పటికప్పుడే సమస్యను పరిష్కరించి పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటవీరయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో విక్రయించే పత్తి రైతులకు ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని, తేమశాతం పేరుతో వెనక్కి పంపిస్తున్నారని అన్నారు. పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ కార్యదర్శి వెంకట్‌లాల్, జోన్ కన్వీనర్లు దాసురావు, శ్రీనివాసరెడ్డి, మురళీధర్‌రావు, నరసింహారావు, బ్రహ్మం, జీవీఆర్, సత్యం , రాజశేఖర్‌రెడ్డి, కృష్ణార్జున్‌రావు పాల్గొన్నారు.

దీక్షాదివస్‌ను విజయవంతం చేయండి



బోనకల్: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్

కల్లూరురూరల్/తల్లాడ/బోనకల్: ఈ నెల 29న ఖమ్మంలో నిర్వహించతలపెట్టిన దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. బుధవారం కల్లూరు, తల్లాడలోని నారాయణపురంలో, బోనకల్ మండలంలోని రావినూతల గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మాజీ సీఎం కేసీఆర్ దీక్షాదివాస్ కార్యక్రమాన్ని చేపట్టారని, ఆయన త్యాగఫలమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ జరిగిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు తిరగాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు లక్కినేని రఘు, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, మధుర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు మల్లికార్జునరావు, మండల కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపేందర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనకు తరలిరండి



ముదిగొండలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ముదిగొండ/కారేపల్లి: డిసెంబర్ ఒకటిన మాలమహానాడు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే మాలల సింహగర్జన మహాసభకు తరలిరావాలని కోరుతూ.. బుధవారం ముదిగొండ, కారేపల్లిలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కోచైర్మన్, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల రవికుమార్, మాలమహానాడు మండల అధ్యక్షుడు సోమందుల రాములు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎస్సీలను విడదీసి, ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలని కొన్ని వ్యవస్థలు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోకన్వీనర్ ఉండేటి శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘ నాయకులు తోటమల్ల సీతారాములు, మండల కన్వీనర్ కొమ్ము నరసింహారావు, నాయకులు రామనాథం, మాలోజి గోవిందు, వేల్పుల లక్ష్మణ్, జట్టి వినోద్, ముదుసు రవి, కులపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పోటు ప్రసాద్‌కు నివాళి



మధిర(చింతకాని): పోటు ప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ మండల నాయకులు

వైరా/కొణిజర్ల/మధిర(చింతకాని)/సత్తుపల్లి(సత్తుపల్లిటౌన్): పేదల కోసం నిరంతరం పోరాటం చేసిన సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నాయకులు తెలిపారు. వైరా, కొణిజర్ల లోని సీపీఎం కార్యాలయంలో, సత్తుపల్లి రింగ్ సెంటర్‌లో ఆయన చిత్రపటాలకు నివాళులర్పించచారు. చింతకానిలో పార్టీ నాయకులు పోటు ప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు యోబు, రామకృష్ణ, కృష్ణవేణి, జ్యోతి, రామలక్ష్మి, సుధాకర్, రాంబాబు, రమేష్, నర్సింహారావు, గోవిందరావు, రవీంద్రబాబు, మల్లికార్జున్‌రావు, రవి, బాబు, స్వర్ణ రమేష్, సీతారాములు, సీపీఐ మండల కార్యదర్శి గోపాలరావు, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు పట్టణ అధ్యక్షుడిగా రాజేందర్



రాజేందర్

మధిర: మాల మహానాడు మధిర పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా బొల్లెద్దు రాజేందర్, నీలం రమేష్ ఎన్నికయ్యారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ ఒకటిన హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన సభ విజయవంతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా మాల మహానాడు కమిటీలను ఏర్పాటు చేయడంతో... వీరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాలల సింహగర్జన సభకు మధిర పట్టణం నుంచి భారీ స్థాయిలో జన సమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మాల మహానాడు మధిర పట్టణ బాధ్యతలు అప్పగించిన మాల పెద్దలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కల్లూరు ఎస్సైగా నాగరాజు



ఎస్సై నాగరాజు

సత్తుపల్లి(కల్లూరు): కల్లూరు ఎస్సైగా తోట నాగరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై షాకీర్ మహబూబాబాద్ ఆకస్మిక బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సత్తుపల్లి టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న తోట నాగరాజు కల్లూరుకు బదిలీపై వచ్చారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి

సత్తుపల్లి(సత్తుపల్లిరూరల్): మండలంలోని బుగ్గపాడు గ్రామం శివాలయంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. 41 రోజులు భక్తి శ్రద్ధలతో దీక్ష చేపట్టిన మాలధారులు శబరిమలైలోని అయ్యప్పస్వామి సన్నిధికి వెళ్లేందుకు గురుస్వాములు హైద్రాబాద్‌శ్రీను, బిక్షపతి ఆధ్వర్యంలో 40 మంది స్వాములకు ఇరుముడి కార్యక్రమం జరిగింది. దీక్షాపరులు ఇరుముడి కట్టుకొని మేల తాళాలతో గ్రామ శివారు వరకు ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మల్లవరంలో..

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలో బుధవారం అర్చకుడు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో 53 మంది అయ్యప్ప స్వాములకు ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా ముందుగా గణపతి పూజ, అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహించారు. మల్లవరం పరిసర గ్రామాల నుంచి 3వేల మందికి పైగా అన్నదానంలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప స్వాములు నగర సంకీర్తన నిర్వహించి శబరిమలైకు వెళ్లారు.

అమ్మపాలెం, రాజ్యాతండా గ్రామాల్లో..

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం, రాజ్యాతండా గ్రామాల్లో మూడ్ సిద్ధు, తేజావత్ కోటి తేజావత్ రామ్మూర్తి, గురుస్వాముల ఆధ్వర్యంలో మాలధారుల ఇరుముడి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. వైరా నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, దూదేకుల నూర్ బాష్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గాలీబ్‌పాషా ముఖ్య అతిధులుగా హజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమమంలో నాగసైదులు, హుస్సేన్, రంజాన్, నాగేశ్వరరావు, అన్వర్ సలీమ్, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యగారిపల్లి, కమలాపురం గ్రామాల్లో..



అయ్యగారిపల్లిలో ఇరుముడులతో కేరళ బయలుదేరిన మాలధారులు

ముదిగొండ: మండలంలోని అయ్యగారిపల్లి, కమలాపురం గ్రామాల్లోని అయ్యప్ప మాలాధారులు బుధవారం ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. అయ్యగారిపల్లిలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గురుస్వామి కోణందుల రాధాకృష్ణనాయర్‌చే వివిధ పంచామృతాలతో అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం 22మంది అయ్యప్ప భక్తులకు ఇరుముడులు కట్టారు. కార్యక్రమంలో చీకుల వీరారెడ్డి, లంకెల నాగభూషణం రెడ్డి, మరికంటి కృష్ణ, సతీష్, ఆదినారాయణ స్వాములు పాల్గొన్నారు.